క్లుప్తంగా

గ్రంథాలయంలో నిరసన



నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: గ్రంథాలయంలో తాగేందుకు నీరు కూడా లేవని, అధికారులు, పాలకులు మంచినీటిని ఏర్పాటు చేయాలని నిరుద్యోగ యువత గురువారం ఖాళీ బాటిల్స్‌తో నిరసనకు దిగారు. మహాత్మాగాంధీ పార్క్‌లోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న తమకు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని నిరుద్యోగులు పేర్కొంటున్నారు. పార్క్ ఆవరణలోని ట్యాంక్ నుండి కూడా మంచినీరు రావడం లేదని, నీటిని బయట కొనుగోలు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గ్రంథాలయంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

వచ్చేనెల 4న పార్సిళ్ల వేలం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం డిపో పరిధి ఖమ్మం బస్టాండ్ కార్గో పార్సిల్ విభాగంలో తీసుకెళ్లకుండా మిగిలిన పార్సిళ్లకు ఏప్రిల్ 4న వేలం నిర్వహించనున్నట్లు లాజిస్టిక్ ఏటీఎం పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పేరుకుపోయిన పార్సిళ్ల క్లియరెన్స్ కోసం ఏప్రిల్ 4 గురువారం సాయంత్రం 4గంటలకు ఖమ్మం కొత్త బస్టాండ్‌లో నిర్వహించే వేలంలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: అనాథ శవానికి అన్నం సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం బల్లేపల్లిలోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఐదు రోజుల క్రితం ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచిన మృతదేహం కోసం ఎవ్వరూ రాకపోవటంతో అన్నం సేవా ట్రస్ట్‌కు పోలీసులు, ఆస్పత్రి సిబ్బంది సమాచారం ఇవ్వగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం సేవా ట్రస్ట్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

నివాళి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ దిగుమతి శాఖ సీనియర్ సభ్యులు బోనగిరి నాగేశ్వరరావు(65) గురువారం అనారోగ్యంతో మృతి చెందగా వ్యాపార ప్రతినిధులు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షులు సోమ నరసింహారావు(జీవై నరేష్), సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, కోశాధ్యక్షులు తల్లాడ రమేష్, సెంట్రల్ ఈసీ సభ్యులు కైలాసపు వేణుగోపాల్ రావు, పాయల నాగేశ్వరరావు, శేషగిరి రావు, శ్రీనివాసరావు, దిగుమతి శాఖ అధ్యక్షులు దిరిశాల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఓం బీం బుష్
వినోద	టిల్లు 2
సాయిరాం	గాడ్జిల్లా(కింగ్: ది న్యూ ఎంపైర్)
ఆదిత్య	రజాకార్
శ్రీనివాస	టిల్లు 2
సుందర్	ది గోట్‌లైఫ్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	5
వంకాయ	16		20
బెండకాయ	16	పాలకూర	2
పచ్చిమిర్చి	34		10
కాకర	36	చుక్కకూర	2
బీర	36		10
దొండ	24	తోటకూర	2
పొట్లకాయ	40		10
నాటు చిక్కుడు	100	గోంగూర	2
గోరుచిక్కుడు	40		10
క్యాబేజీ	28	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	50		30
క్యారెట్	36	పుదీన	1
బీన్స్	76		20

-ఖమ్మం వ్యవసాయం

పెద్దాస్పత్రిలో కన్నీటి కష్టాలు..!

తాగునీటి కోసం రోగుల ఇక్కట్లు

- కేఎంసీ నుంచి రోజు విడిచి రోజు సరఫరా
- రోగుల అవసరాలకు సరిపడని వైనం
- ఆస్పత్రి బావిలో అడుగంటిన నీరు



పెద్దాస్పత్రిలోని బావి (ఇన్‌సెట్) అడుగంటిన బావి

ఖమ్మం వైద్యవిభాగం: నగర తాగునీటి అవసరాలకు కీలకమైన పాలేరు రిజర్వాయర్‌లో నీరు అడుగంటగా ప్రజలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గృహావసరాలకు రెండు, మూడు రోజులకోసారి గంట మాత్రమే నీటిని వదులుతుండగా.. నగర ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు ఇదే పరిస్థితి ఇప్పుడు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి కూడా వచ్చిపడింది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రోజు విడిచి రోజు ఆస్పత్రికి కొద్ది సమయమే నీటిని వదులుతుండడంతో ఇక్కట్లు ఏర్పడుతున్నాయి.

రోగుల తాకిడి ఎక్కువ..

పెద్దాస్పత్రికి ఏడాది పొడవునా తాకిడి ఉంటుంది. రోజూ 1,500 మందికి పైగా రోగుల వైద్య సేవల కోసం వస్తుంటారు. సుమారు 500లకు పైగా బెడ్లు అందుబాటులో ఉన్నాయి. అవసరాన్ని బట్టి మరో వంద పడకల వరకు వినియోగించే అవకాశం ఉంది. అలాగే మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నిత్యం ప్రసవాలు జరుగుతుంటాయి. సుదూర ప్రాంతాల నుంచి సైతం వచ్చి సేవలు పొందుతుంటారు. జనరల్ ఆస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంతో పాటు, ట్రామా కేర్ భవనం, టీబీ వార్డు, కేన్సర్ కేర్ సెంటర్, డయాలసిస్ సెంటర్లకు నీరు సరఫరా చేస్తుంటారు. పెద్దాస్పత్రిలో ఇన్‌పేషంట్ రోగులు, వారి సహాయకులతో నీటి వినియోగం ఎక్కువగా ఉంటోంది. అయితే కొన్ని రోజులుగా నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తడంతో రోగులకు సమస్య వచ్చిపడింది. ఉదయం, సాయంత్రం నల్లాల నుండి నీళ్లు రావడం ఆగిపోతుండటంతో ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ సమయంలో బోర్లు, బావిని వినియోగించి కొద్ది సేపు నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం సమస్య వచ్చినప్పుడు తాత్కాలికంగా సరఫరా చేస్తున్నారు. ముందుముందు నీటి ఎద్దడి ఎక్కువ అయితే ఎలా రోగులకు నీటిని సరఫరా చేస్తారో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి.

రోజుకు 2 లక్షల లీటర్ల వినియోగం..

ఆస్పత్రిలో రోజు వారీ నీటి వినియోగం భారీగానే ఉంటుంది. ప్రస్తుతం రోజుకు జనరల్ ఆస్పత్రిలో 1.20లక్షల లీటర్లు, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 90 వేల లీటర్ల వాడకం ఉంటోంది. మామూలు రోజుల్లో మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ప్రతీ రోజు నీటి సరఫరా ఉండేది. వార్షాభావ పరిస్థితులతో నీటి ఎద్దడి ఏర్పడటంతో ప్రస్తుతం రెండు రోజులకొకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. అంటే రోజూ వినియోగించే నీటిలో సగం కూడా సరఫరా కావడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే ఎండలు ఇంకా ముదిరిన తర్వాత ఎలా సరఫరా చేస్తారోనని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో మున్సిపల్ నీటి సరఫరాలో సమస్య వచ్చినప్పుడు ప్రత్యామ్నాయంగా రెండు బోర్లు, ఒక బావితో సరఫరా చేస్తారు. అయితే ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటుతుండగా ఆస్పత్రి బావి కూడా అడుగంటింది. దీంతో అటు కేఎంసీ నీటితో పాటు బోర్లు, బావి ద్వారా లభ్యత ఆధారంగా నీరు వినియోగిస్తున్నా రోగుల అవసరాలకు సరిపోవడం లేదు.



మున్సిపాలిటీ ద్వారా వచ్చే నీటిని నిల్వ చేసే సంప్

ఇప్పటి వరకైతే ఇబ్బంది లేదు...



ఇటీవల రెండు రోజుల పాటు కొంత నీటి సమస్య వచ్చినా ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేదు. కార్పొరేషన్ సరఫరా చేసే నీటితోపాటు బోర్లు, బావి ద్వారా వచ్చే నీరు ఆస్పత్రి అవసరాలకు సరిపోతోంది. ముందు ముందు వచ్చే సమస్యలను అధిగమించేందుకు రెండు బోర్లు వేయటానికి అధికారులు అనుమతి ఇచ్చారు. డయాలసిస్ నిర్వహణకు ఒక బోరు వేస్తుండగా మరో రెండు బోర్లు త్వరలో వేయనున్నారు. రోగులకు ఇబ్బందులు రాకుండా వేసవిలో నీటి సరఫరా చేసేందుకు అన్ని విధాలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

– బి.అమర్‌సింగ్, ఆర్ఎంఓ

ఉపాధి కూలీలకు రూ.600 చెల్లించాలి



మాట్లాడుతున్న వెంకయ్య

రఘునాథపాలెం: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు చెల్లించే కనీస వేతనాలు ప్రస్తుతం పెరిగిన ప్రజల జీవన వ్యయానికి అనుగుణంగా లేవని, కనీస వేతన చట్టం ప్రకారం రోజు కూలీ రూ.600 ఇవ్వాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. గురువారం రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలో జరిగిన ఏపీకేఎంఎస్ ఖమ్మం డివిజన్ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయకుండా తూట్లు పొడుస్తుందని విమర్శించారు. కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని, వేసవికాలం కూలీలకు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. సంఘం అధ్యక్షుడు కూరాకుల నరసయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేశోతు పాపారావు, భూక్య శంకర్, మేక పిచ్చయ్య పాల్గొన్నారు.

ప్రారంభమైన యాగ పూజలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరం 4వ డివిజన్ పరిధి కైకొండాయిగూడెం రోడ్డులో వేంచేసియున్న శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల పురాతన దేవాలయం పునఃప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా గురువారం యాగం పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో యాగశాలను అర్చక బృందం ప్రత్యేక పూజల నిర్వహించారు. మూడు రోజులు పూజలు, 30న ప్రతిష్ఠ సంబురాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమ్ము భాస్కర్, ప్రధాన కార్యదర్శి సూరంశెట్టి నర్సింహారావు కోశాధికారి గుండోజు రామాచారి తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బాలగణపతి ఆలయంలో సంకట చతుర్దశి



పూజలు చేస్తున్న భక్తులు

ఖమ్మం అర్బన్: నగరంలోని 10వ డివిజన్ ఇందిరా నగర్ జంక్షన్‌లోని బాలగణపతి దేవాలయంలో గురువారం సంకటహర చతుర్థి అభిషేకం పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు గిరి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. దేవాలయ అధ్యక్షుడు కార్యదర్శి భాజిని వీరయ్య, తిరుపతిరావు, రవికుమార్, మోహిని దంపతుల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందించారు.

గ్రాడ్యుయేషన్ డే

ఖమ్మం సహకారనగర్: నగరంలోని వీడీవోస్ కాలనీలోని రెజొనెన్స్ ఇన్ఫో పాఠశాలలో యుకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలను శుక్రవారం నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు నీలిమ, ఆర్‌వి నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావులు పేర్కొన్నారు. ప్రభుత్వాసుత్రి వైద్యులు బాబురత్నాకర్, ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో విద్యార్థులు, యాజమాన్యం

వైభవంగా శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు



ఊరేగింపులో కమిటీ నిర్వాహకులు, భక్తులు

కామేపల్లి : మండలంలోని తాళ్లగూడెం గ్రామంలోని తిరుపతమ్మ దేవాలయంలో గురువారం గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మతల్లి కల్యాణ మహోత్సవ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ పూజారి ప్రసాద్, సాయిభార్గవ్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి కల్యాణం జరిపారు. కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఘనంగా ఊరేగింపు చేపట్టారు. మహిళలు, యువత కోలాటాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

న్యాక్‌పై అవగాహన



గురుకుల కళాశాల అధ్యాపకులతో ప్రొఫెసర్లు

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్ రోడ్డులో గల తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం న్యాక్‌కు సంబంధించిన అంశాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి తెలిపారు. ఖమ్మం ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్లు ఏ.సత్యవతి, ఎస్.రమేష్ న్యాక్ ద్వారా అత్యుత్తమ గ్రేడ్ సాధించే అంశాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బండి వెంకటేశ్వరరావు, కో ఆర్డినేటర్ మంజుల, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

కామేపల్లి: బైక్ అదుపుతప్పి కిందపడటంతో వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని పండితాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూగుంట్ల వెంకన్న తన బైక్‌పై పొలానికి వెళ్తుండగా మార్గమధ్యలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలోని ములుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో వెంకన్న కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వైద్యం నిమిత్తం ప్రైవేట్ వాహనంలో ఖమ్మం తరలించారు.

మత్స్యవిత్తన క్షేత్రం సందర్శన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు వైరాలోని మత్స్యవిత్తన క్షేత్రాన్ని ఫీల్డ్‌ట్రిప్‌లో భాగంగా గురువారం సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, జువాలజీ అధ్యాపకులు రామకుమారస్వామిలు తెలిపారు. వైరా ఫిషరీస్ ఫీల్డ్ ఆఫీసర్ చాముండేశ్వరి చేప విత్తనాలు, చెరువులు, చేపల పెంపకం విధానం తదితర అంశాలపై పలు సూచనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్రం వద్ద విద్యార్థినులు

ఖమ్మంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలు

ఖమ్మం మామిళ్లగూడెం: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర మహాసభలను మే నెల చివరి వారంలో ఖమ్మంలో నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ తెలిపారు. ఖమ్మంలో గురువారం జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సభల ఏర్పాట్లపై చర్చించేందుకు ఏప్రిల్ మొదటి వారంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తామని, అన్నివర్గాల ప్రజలు, జర్నలిస్టులు సహకరించి జయప్రదం చేయాలని రాంనారాయణ కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎనుగు వెంకటేశ్వరావుతో పాటు మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, ఎస్.వెంకట్రావు, ఖదీర్, ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, నలజాల వెంకట్రావు, శివానంద, ఎం.పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, కూరాకుల గోపి, వై.మాధవరావు, ఎస్కే.మోహినుద్దీన్, తాళ్లూరి మురళి, నామా పురుషోత్తం, జనార్ధనాచారి, మేడి రమేష్, భవానీసింగ్, ఆలస్యం అప్పారావు, ఏలూరి వేణుగోపాల్, కల్యాణ్ రవికుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంనారాయణ

జిల్లా సదస్సును జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో ఏప్రిల్ 8న జరిగే మాదిగ, మాదిగ ఉపకులాల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ లంకా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఖమ్మంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో వర్గీకరణ చేస్తామని మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, నాగమణి, ఉపేందర్, మాతంగి శ్రీను పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

రఘునాథపాలెం: మండలకేంద్రమైన రఘునాథపాలెంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. పీఎస్ఆర్ ట్రస్టు ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించి చైర్మెన్ పరిశ పుల్లయ్య గర్భిణులకు చీర, సారె అందజేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ కవిత, ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు చాపలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యులు పారాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, ఆయా కొండమ్మ, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.



చీర, సారె అందజేస్తున్న ట్రస్టుచైర్మన్ పుల్లయ్య, సీడీపీఓ కవిత

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం అనేది నిస్వార్థమైన సేవ అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ డీపీఓ శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాళ్లు వంకాయలపాటి రామారావు, మద్దినేని వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవో విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారం గ్రామంలో గురువారం తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు ఇటీవల కాలంలో సీపీఎం నాయకులు ఆందోళన నిర్వహించగా అధికారులు ఎట్టకేలకు స్పందించి బోరు ఏర్పాటుచేశారు.

రాయలకు సన్మానం

తిరుమలాయపాలెం: మండలంలోని దమ్మాయిగూడెంలోని గురువారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావును కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉన్నం రాజశేఖర్, షేక్ షకీల్, పత్తి నాగేశ్వరావు, ఆశీర్వాదం, జి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.



రాయలను సన్మానిస్తున్న నాయకులు

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- అనుమతులు లేకుండా ఇటుక బట్టీలకు విలువైన చెట్ల చేరవేత
- గ్రామాల నుంచి కట్టెల మిల్లులకు..
- నిబంధనలు పట్టించుకోని అక్రమ రవాణాదారులు



చెట్ల మొద్దులను సామిల్లుకు తరలిస్తున్న ట్రాక్టర్

ఖమ్మంరూరల్: గ్రామాల్లో పచ్చని చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా చెట్లను నరికి పట్టణాల్లో కట్టెల మిల్లులకు, ఇటుకబట్టీలకు అక్రమ రవాణాదారులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. గ్రామాల్లోని పొలాల్లో, బీడుభూముల్లో ఉన్న విలువైన చెట్లను రవాణాదారులు నరికి తరలించాలంటే అటవీశాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే పాలేరు నియోజకవర్గంలో కట్టె రవాణాదారులు అటవీశాఖ అధికారుల అనుమతి లేకుండా భూముల్లో ఉన్న చెట్లను నరికేసి మిల్లులకు తరలిస్తున్నారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా జంకూ బొంకూ లేకుండా చెట్లను నరికి తరలిస్తున్నారు. అయితే ఈ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులు, పర్యావరణాన్ని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో చెట్ల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. ఈ దందాను అధికారులు అడ్డుకోకుండా వారిని మచ్చిక చేసుకొని వాల్టా చట్టాన్ని తమకు అనుకూలంగా మలుచుకుని దళారులు రెచ్చిపోతున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఇదిలా ఉండగా ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల నుండి పొలాల్లో, బీడుభూముల్లో ఉన్న రకరకాల చెట్లను నరికి కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలాల్లో గల సా మిల్లులకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలను తుంగలో తొక్కిన అక్రమ రవాణాదారులు అడ్డూ అదుపూ లేకుండా వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసం దాడులు చేసిన దాఖలాలే లేకపోవడంతో అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఎవరో ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల మెప్పు పొందడానికి తూతూమంత్రంగా దాడులు చేస్తున్నారే తప్ప అక్రమ రవాణాను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవడంలేదు. వాస్తవంగా అటవీశాఖ అధికారుల అనుమతితో పాటు, సంబంధిత గ్రామపంచాయతీ నుండి ఈచెట్లను నరికి తరలించడం ద్వారా పర్యావరణానికి నష్టం ఉండదు అని సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆచరణలో మాత్రం రవాణాదారులు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్నారు.

ఇటుక బట్టీలకు వందల ట్రిప్పులు..

ఇటుక బట్టీలు కాల్చడానికి కలప తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. దీంతో అడ్డగోలుగా చెట్లను నరికి రూరల్ మండలంలోని ఇటుక బట్టీలకు రేయింబవళ్లు కలపను తరలిస్తున్నారు. అటవీచట్టం ప్రకారం చింతచెట్లను, మోదుగు చెట్లను నరికి తరలించకూడదు. ఇలా చేస్తే కఠినమైన శిక్షలుంటాయి. అయినా ఇవేమీ పట్టనట్లు అన్ని రకాలచెట్లను నరికి ఇటుక బట్టీలకు సామిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోకపోతే పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని పలువురు వాపోతున్నారు.